# నమస్తే కరీంనగర్

నమస్తే తెలంగాణ | బుధవారం 17, మే 2017 | పేజీలు : 20

WWW.NTNEWS.COM


వాతావరణం
గరిష్ఠం $44^{0}$
కనిష్ఠం $26^{0}$



మానకొండూర్ రూరల్: ముంజంపల్లిలో ఎమ్మెల్యే రసమయికి గొంగడి, గొర్రె పిల్లను అందిస్తున్న యాదవులు

## కుల వృత్తుల పరిరక్షణే ధ్యేయం

- ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి
- ఖాదరగూడెం, ముంజంపల్లిలో గొర్రెల యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక

→ 18



హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో మానేరు రివర్ ఫ్రంట్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న టాటా కంపెనీ బృందం, పాల్గొన్న మంత్రి ఈటల, ఎంపీ వినోద్, ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ నారదాసు

14 ←

# నగరంపై సీఎం నజర్

### మానేరు రివర్‌ఫ్రంట్‌పై మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేతో భేటీ

- సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచన
- నేడు ముఖ్యమంత్రి సమక్షంలో చర్చ
- బయలుదేరిన అధికారులు
- అభివృద్ధి కోసం ప్రత్యేక అధికారి నియామకం?
- సుడా ఏర్పాటుకు ఆదేశం
- త్వరలో జిల్లాకు సీఎం కేసీఆర్?

**కరీంనగర్** నగరాభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. మానేరు రివర్‌ఫ్రంట్‌ను దేశంలోనే అత్యుత్తమంగా నిర్మించడమే కాకుండా.. నగరాన్ని ఆకర్షణీయంగా మార్చేదిశగా ముందుకు వెళ్తున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో భేటీ అయిన ఆయన నేడు ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం కానున్నారు. సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగమంతా హైదరాబాద్ బయలుదేరి వెళ్లగా, నేడు ఒక సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకోనున్నది. - కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ



రామడుగు: తిర్మలాపూర్‌లోని నర్సింహులకుంట మట్టిని ట్రాక్టర్ ట్రాలీలో పోస్తున్న ఎమ్మెల్యే బొడిగ శోభ

## చెరువుతోనే బతుకుదెరువు

- మహాయజ్ఞంలా 'మిషన్ కాకతీయ'
- చొప్పదండి ఎమ్మెల్యే బొడిగ శోభ
- రామడుగు మండలంలో పూడికతీత పనులు ప్రారంభం

→ 5



నగరంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల

.. మధ్యపేజీలో

## ప్రభుత్వ కళాశాల పిలుస్తోంది..


- కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు
- తాజాగా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- 18నుంచి వచ్చేనెల 6దాకా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ
- జూన్ మొదటివారం నుంచి జూనియర్ కాలేజీల్లో షురూ..
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు
- అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్‌కు అవకాశాలు

### ప్రైవేట్‌కు దీటుగా బోధన.. ఏటా అత్యుత్తమ ఫలితాలు

**విశాలమైన తరగతి గదులు..** సువిశాలమైన మైదానాలు.. విజ్ఞానం పంచే గ్రంథాలయాలు.. కాలంతోపాటే ఎన్నో ఆధునిక కోర్సులు.. ఉచిత పుస్తకాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకులు.. ప్రైవేట్‌కు దీటుగా అత్యుత్తమ ఫలితాలు.. సర్కారు కాలేజీల్లో చదువుకోవడానికి ఇంతకుమించి ఇంకే కావాలి! వేలాది మందికి ఉజ్వల భవిష్యత్‌ను ఇచ్చిన ఆ చదువుల కోవెలల్లో తాజాగా ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయి. రేపటినుంచి డిగ్రీలో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండగా, జూన్ మొదటివారం నుంచి ఇంటర్మీడియెట్‌లో మొదలుకానున్నాయి. ఇక్కడ రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందనుండగా ఆ కళాశాలలు రా రమ్మని పిలుస్తున్నాయి. - కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ కలెక్టరేట్

# నగరంపై సీఎం నజర్!

- మానేరు రివర్‌ఫ్రంట్‌పై మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేతో భేటీ
- సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచన
- నేడు ముఖ్యమంత్రి సమక్షంలో చర్చ
- బయలుదేరిన అధికారులు
- అభివృద్ధి కోసం ప్రత్యేక అధికారి?
- సుడా ఏర్పాటుకు ఆదేశం
- త్వరలో జిల్లాకు సీఎం కేసీఆర్?



మానేరు రివర్ ఫ్రంట్ ఊహాచిత్రం

**(కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ)**
దిగువమానేరు జలాశయ పరిధిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన మానేరు రివర్‌ఫ్రంట్‌పై మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో సమావేశం జరిగింది. హైదరాబాద్ ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో జిల్లా మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగులకమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు పలువురు రాష్ట్ర స్థాయి అధికారులతో పాటుగా టాటా కంపెనీ బృందం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానేరు రివర్‌ఫ్రంట్‌పై టాటా బృందం అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిని నిశితంగా వీక్షించిన ముఖ్యమంత్రి.. మానేరు ఫ్రంట్‌తో పాటుగా నగర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై నాయకులతో చర్చించారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు, రోడ్ల పనుల్లో జరుగుతున్న జాప్యం, నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన ప్రణాళికలు వంటి అంశాలపై నేతలు చాలా సేపు ముఖ్యమంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా నగరంలో జరుగుతున్న పనులు, ఇతరత్రా వివరాలను మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు.

**ప్రత్యేకాధికారి నియామకం..**
ఒక సమగ్ర ప్రణాళికతో నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి, అలాగే కేటాయించిన నిధులతో పనులు యుద్ధప్రాతిపదికన జరగడానికి, వివిధ శాఖలను సమన్వయం చేయడానికి నగరానికి త్వరలో ప్రత్యేకాధికారిని నియమించనున్నట్లు ముఖ్యమంత్రి నేతలతో తెలిపారు. ఆ మేరకు ప్రత్యేకాధికారి విషయాన్ని వెంటనే పరిశీలించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. దీంతో పాటు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ని ఏర్పాటు చేయాలని అధికారులను అదేశించారు. ఈ విషయంలో జాప్యం చేయద్దని సూచించారు వెంటనే సుడా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అయితే సుడాకు సంబంధించి గతంలోనే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలోనే సుడా ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది.

**నేడు సమావేశం..**
నగర సమగ్ర అభివృద్ధిపై పకడ్బందీగా ముందుకు వెళ్లాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి.. బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం కానున్నారు. ప్రగతి భవన్‌లో జరిగే ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ కమిషనర్, వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు రావాలని అదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు పలువురు అధికారులు మంగళవారం రాత్రే బయలుదేరి వెళ్లగా.. మరికొంత మంది బుధవారం ఉదయం వెళ్లేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**త్వరలో కరీంనగర్‌కు సీఎం..**
మానేరు రివర్‌ఫ్రంట్‌కు కావాల్సిన భూసేకరణ పనులను వెను వెంటనే ప్రారంభించాలని అధికారులకు ముఖ్యమంత్రి అదేశాలు జారీ చేశారని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం సమావేశం ముగిసిన తర్వాత ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియను చేపడుతామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జరిగిన భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి కరీంనగర్ అభివృద్ధికోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు కూడా చేశారు. ప్రధానంగా కరీంనగర్ ఒక అకర్షణీయ నగరంగా రూపుదిద్దుకోవాలని, ఇందుకోసం జరిగే పనుల్లో ఎక్కడా జాప్యం జరిగేందుకు అవకాశం లేకుండా చూడాలనీ, నగరం మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరూ మానేరు రివర్‌ఫ్రంట్‌ను చూసి వెళ్లే విధంగా పనులు జరగాలని సూచించారు. కాగా త్వరలో సీఎం కేసీఆర్ కరీంనగర్‌కు రానున్నట్లు టీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# ఐఎస్ఎల్‌లో వేగం పెంచాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్


మాట్లాడుతున్న కలెక్టర్ సర్ఫరాజ్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ** : జిల్లాలో అన్ని గ్రామాల్లో మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదే శించారు. మంగళవారం కలెక్టరేట్‌లోదత్తత అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 80 శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందని, తిమ్మాపూర్‌లో 96 శాతం, మానకొండూర్‌లో 94 శాతం, కరీంనగర్‌లో 92 శాతం పూర్తయిందని, అదే విధంగా మిగితా మండలాల్లో పనులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇందుకు నిధుల కొరత లేదన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను అన్నింటిని వందశాతం ఈనెల చివరి వరకు త్వరితగతిన పూర్తి చేయుటకు తగు చర్యలు చేపట్టాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఫొటో, ఇతర వివరాలను ఆప్‌లోడ్ చేయాలన్నారు. ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఒంటరి మహిళల ఫించన్ కొరకు ఈనెల 21 వరకు ధరఖాస్తులు స్వీకరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు రాజాగౌడ్, చిన్నయ్య, డీఆర్‌డీవో, డీఎంహెచ్‌వో, ముఖ్య ప్రణాళికాధికారి, డీఆర్ఓ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రంలో చోరీ

**ఎలిగేడు :** మండల కేంద్రంలో వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు ఆవరణలో మండల టీసెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం, మూడు టార్పాలిండ్లు మాయమ్యాయి. టీ సెర్ప్ కేంద్రంలో మండల కేంద్రానికి చెందిన రైతు కుడుదుల నరేశ్ చెందిన 1.2 క్వింటాళ్ల ధాన్యం సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే, టీ సెర్ప్‌కు చెందిన మూడు టార్పాలిన్లు కూడా ఎత్తుకెళ్లారు. ఈ చోరీ విషయమై మార్కెట్ కమిటీ కొనుగోలు సభ్యులు మంగళవారం జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఈ కొనుగోలు కేంద్రంలో ధాన్యం మాయమైనట్లు, ఆరోపణన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజమ్మను అడగగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

**జూలపల్లి :** డీఆర్‌డీఏ–ఈజీఎంఎం సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకోసం ఈ నెల 24న పెద్దపల్లిలో ఏర్పాటు చేస్తున్న 'జాబ్ మేళా' సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. 18 నుంచి 35 ఏళ్లలోపు పదో తరగతి నుంచి పీజీ చదివి ఉత్తీర్ణులైనత అభ్యర్థులకు 25 ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులు విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ పత్రాలు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలతో బందంపల్లిలోని స్వరూప గార్డెన్స్‌లో హాజరుకావాలన్నారు.

# స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 15 నామినేషన్లు

- ఆఖరు నిమిషంలో మూకుమ్మడిగా దాఖలు


నామినేషన్లు దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** కరీంనగర్ నగర పాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు 15 నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం సాయంత్రం 3 గంటలకు గడువు ముగియగా, 15 మంది నామినేషను వేశారు. సోమవారం మధ్యాహ్నం దాకా కూడా టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో అధికార పార్టీ నుంచి పదమూడు మంది కార్పొరేటర్లు ఈ ఎన్నికల కోసం నామినేషన్లు దాఖలు చేశారు. అయితే నామినేషన్ల గడువు దగ్గర పడుతున్నా టీఆర్ఎస్ నేతలు అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో ఆశావాహులంతా మూకుమ్మడిగా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో నామినేషన్లను దాఖలు చేశారు. బల్దియాలో స్టాండింగ్ కమిటీలో ఐదుగురు సభ్యులకు అవకాశం ఉంది. కాగా టీఆర్ఎస్‌కు 36మంది కార్పొరేటర్ల బలం ఉంది. దీంతో అన్ని సీట్లు అధికార పార్టీకే దక్కనున్నాయి. నామినేషన్ల రెండవ రోజు కాంగ్రెస్ నుంచి 29వ కార్పొరేటర్ జక్కని ఉమాపతి నామినేషన్ దాఖలు చేసిన విషయం విదితమే. మంగళవారం టీఆర్ఎస్ నుంచి పదమూడు మంది సభ్యులు నామినేషన్ దా ఖలు చేశారు. బుధవారం నామినేషన్ల పరిశీలన జరగగా, గురువారం నుంచి ఈనెల 20 వరకు నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉంది. ఉదయం నుంచి ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న కార్పొరేటర్లంతా అధినేతలు ఎ ప్పుడు తమతో సంప్రదించి అభ్యర్థులను ఖరారు చేస్తార న్న విషయంలో ఆసక్తితో ఎదురు చూశారు. ఆశావాహు ల్లో అత్యధిక మంది మున్సిపల్ కార్యాలయంలోనే ఉద యం నుంచి అధినేతలు ప్రకటించే పేర్ల కోసం కాలం గడిపారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటల వరకు కూడా టీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో మూకుమ్మడిగా వెళ్లి ఒకేసారి 11 మంది కార్పొరేటర్లు తమ నామినేషన్లు దాఖలు చేయడం విశేషం.

**నామినేషన్లు దాఖలు చేసింది వీరే. .**
స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం 15మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో కాంగ్రెస్ నుంచి జక్కని ఉమాపతి, ఎంఐఎం నుంచి లింగంపల్లి శ్రీనివాస్, టీఆర్ఎస్ నుంచి వై.సునీల్‌రావు, కర్ర లింగయ్య, కోడూరి రవీందర్‌గౌడ్, బండారి వేణు, మెండి శ్రీలత, పెద్దపల్లి రవీందర్, బోయినిపల్లి రజనీదేవి, నలువాల రవీందర్, సాదవేని సుజాత, నేతికుంట కళావతి, గుడూరి శారద, మహ్మద్ మాజిద్ హుస్సేన్, వై అపర్ణ నామినేషన్లు దాఖలు చేశారు.